శోభాయమానంగా శోభకృత్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో జ్యోతిష భాస్కర గడ్డమణుగు తేజస్వీశర్మ పంచాగ పఠనం చేశారు. గాయకులు సాయిచరణ్, లలితలు భక్తి గీతాల సంగీత విభావరి అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, ఆర్యవైశ్య సభ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

■ అగస్త్యేశ్వరాలయంలో శ్రీ శోభకృత్ ఉగాది పర్వదిన సందర్భంగా బుధవారం సాయంత్రం నంది అవార్డు గ్రహీత యడవల్లి రమణయ్య భాగవతార్‌తో నిర్వహించిన భూ కైలాస్ హరికథా కాలక్షేపం అందరిని ఆకట్టుకుంది, బ్రహ్మశ్రీ మాడుగుల నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం జరిగింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ శంకర బాలాజీ, ఆలయ మాజీ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

■ స్థానిక శ్రీరాముపేటలోని పాండురంగ స్వామి ఆలయంలో రామకృష్ణయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఆయిల్ మిల్లులో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ శోభకృత్ ఉగాది కవి సమ్మేళనాన్ని 70 మంది కవులతో శోభాయమానంగా నిర్వహించడం అపూర్వమని కొనియాడారు. సినీ హబ్ అధినేత బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడారు. కవులందరినీ సత్కరించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కవులు ఏసీ దస్తగిరి, మూలె రామమునిరెడ్డి, తవ్వా వెంకటయ్య, పల్లా కృష్ణ, గుంటుముక్కల గోవిందు, ఖలందర్, దుర్గా భవాని, చెంబ్రాయుడు, భాస్కర్ రాజు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, కొమ్మిశెట్టి మోహన్, నీలవేణి, అమృతవల్లి, అమీర్, చదువులబాబు తదితరులు పలు అంశాలపై కవిత్వాన్ని వినిపించారు. నేత్ర వైద్యుడు వైవీ రామమునిరెడ్డి, సీపీ సాధు గోపాలకృష్ణ, కొనిరెడ్డి కుటుంబీకులు శోభ, హర్షవర్ధన్‌రెడ్డి, హిమజ, రమణారెడ్డి పాల్గొన్నారు.

■ స్థానిక శివాలయం సర్కిల్‌లో బుధవారం ఆదరణ స్వచ్ఛంద సేవాసమితి, కీర్తన సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ, ఉచిత రక్తవర్గ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, సభ్యులు శంకరాచారి, మాధవ, శివకృష్ణ, రవి, కీర్తన సేవాసమితి సభ్యులు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయాల్లో బుధవారం సాయంత్రం వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఆశీనులు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పగిడాల ఆలయ చైర్మన్ శివరామ సుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ పాల్గొన్నారు.

అందరికి విజయాలు చేకూరాలి

శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ విజయాలు చేకూరాలని అర్చకులు పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం వెల్లాల పుణ్యక్షేత్రంలో పార్వతీదేవి, భీమలింగేశ్వర, వీరభద్ర, నరసింహ స్వాములకు అర్చకుడు వెంకటా చలపతి, చెన్నకేశవ, సంజీవరాయ స్వామి ఆలయంలో అర్చకులు శేషాచార్యులు, మాధవాచార్యులు, పవన్, సురేంద్రలు ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవికి 303 నిమ్మకాయలతో దండ, గులాబీ, కనకాంబరం, మల్లెపూల దండలు వేసి శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పాల్గొన్నారు.

■ మండలంలోని ఆలయాల్లో అర్చకులు ఉగాది పంచాంగ పఠనం చేశారు. ఇందులో భాగంగా రాజుపాళెంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో అర్చకులు దుర్భాక నాగేంద్రశర్మ మాట్లాడుతూ ఈఏడాది శోభకృత్ నామ సంవత్సరంలో పసుపు, నలుపు రంగు పంటలైన పెసలు, మినుములు, చిరుధాన్యాలు దిగుబడులు బాగా వస్తాయని తెలిపారు.

దువ్వూరు : మండల వ్యాప్తంగా ఉగాది పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన దువ్వూరులోని కేసీ కెనాల్ ఒడ్డున ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. కోలాటం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ఉగాది పండుగను పురస్కరించుకుని రెండు పాలపళ్ల ఎడ్లకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.20వేలు నంద్యాల జిల్లా, డోన్ మండలం ఉంగరాణిగుండ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఎడ్లు గెలుపొందాయి. రెండో బహుమతి రూ.15వేలు దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన కాకి గంగాధర్ ఎడ్లు, మూడో బహుమతి రూ.10వేలు నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన బంగి నాగరాజు ఎడ్లు, నాలుగో బహుమతి రూ.8వేలు కలసపాడు మండలం మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బట్టిపోతుల శంకరయ్య ఎడ్లు, 5వ బహుమతి రూ.5వేలు ఎర్రగుంట్ల మండలం సిరాజుపల్లెకు చెందిన సురేష్ రెడ్డి ఎడ్లు గెలుపొందాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు.

బి.మఠంలో పంచాంగ శ్రవణం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఉగాది సందర్భంగా బుధవారం సాయంత్రం దేవస్థానం మండపంలో శోభకృతనామ నూతన సంవత్సరం సందర్భంగా మఠం ఆస్థాన సిద్ధాంతి ఇడమ కంటి జనార్ధనాచార్యులు పంచాగ శ్రావణం చేశారు. అంతకు ముందు మఠంలో ఉగాది సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో మఠం పిట్‌పర్సన్ శంకర్‌బ బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, దత్తస్వామి, గ్రామ ప్రజలు ,భక్తులు పాల్గొన్నారు.

కాశినాయన : తెలుగు సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పండుగను బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎద్దులు ఉన్న వారు ఎద్దులను అలంకరించి పొలాల్లోకి వెళ్లి ఏరువాక నిర్వహించారు.

సంప్రదాయ దుస్తుల్లో పోలీసులు

ఉగాది పండుగను పురస్కరించుకుని కాశినాయన మండలం నరసాపురం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ హరిప్రసాద్, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగను జరుపుకున్నారు. పోలీసుస్టేషన్‌ను మావిడాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపవరం : మండల వ్యాప్తంగా బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ఆలయాల్లో శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం పఠించారు. ఉగాది నుండే కొత్త సంవత్సరం ప్రారంభం కావడంతో పంటలు బాగా పండాలని, ఏడాదంతా కుటుంబాలు సంతోషంగా ఉండాలని ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు.

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె, బి.కోడూరు గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా వేదపండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ముఖ్యంగా మండలంలోని మేకవారిపల్లె అఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమం తదితర దేవాలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ సౌఖ్యాలతో ఉండాలని వేదపండితులు హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డిలు పాల్గొన్నారు.


అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో హరికథ చెబుతున్న యడవల్లి రమణయ్య భాగవతార్


రాజుపాళెం: వెల్లాల గ్రామంలో పల్లకీ సేవలో భక్తులు


పంచాంగ పఠనం చేస్తున్న రామకృష్ణయ్య సిద్ధాంతి


అవధాని నరాల రామారెడ్డిని సన్మానిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి


సాంప్రదాయ దుస్తుల్లో ఎస్‌ఐ, సిబ్బంది


బండలాగుతున్న ఎద్దు


ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న దృశ్యం

మతాలకు అతీతంగా ఉగాది


స్వామికి ప్రత్యేక పూజ చేయిస్తున్న ముస్లింలు

పోరుమామిళ్ల : శోభకృత్ నామ ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయాన్నే పట్టణ ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ బాలా త్రిపురసుందరీదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, సాయి మందిరం, అమ్మవారి శాల, శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానం , శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలకు భక్తులు భారీగా వెళ్లి పూజలు చేయించారు. అలాగే ముస్లిం కుటుంబాలు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సగిలేరు ఒడ్డున వెలసిన శ్రీ మద్దిమాను గురప్పస్వామికి పండుగ సందర్భంగా అర్చకులు వేణుమాధవశర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. దుర్భాక కిషోర్‌శర్మ ప్రజలకు పంచాంగ శ్రవణం చేశారు.

క్లుప్తంగా

రామలింగ చౌడేశ్వరికి ఘనంగా బిందెసేవ


బిందెసేవ మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హనుమాన్ నగర్‌లోని రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో బుధవారం ఉగాది సందర్భంగా అమ్మవారికి ఘనంగా బిందెసేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించారు. సాయంత్రం దేవాంగపేట నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని అమ్మవారి నామస్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ముస్తాబైన జామియా మసీదు


విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న జామియా మసీదు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రముఖమైన జామియా మసీదును అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానుండటంతో మసీదుకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రస్తుతం మసీదుకు అధికారిక కమిటీ లేకపోవడంతో ఎమ్మెల్యే రాచమల్లు 23 మందితో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో మసీదును అందంగా తయారు చేయడంతోపాటు ఉపవాసాల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నేడు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని విశ్వనాథపురం, గుంతచీపాడు గ్రామాలలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. రెండు గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో మధ్యాహ్నం నుంచి గ్రామంలో ఇళ్లకు పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేస్తామని వైద్యాధికారి చెప్పారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయా ప్రాంతాల ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మైదుకూరు మండలం, మున్సిపాలిటి పరిధిలోని భూమాయపల్లెలో అంగన్వాడీ వర్కర్(బీసీ సీ), హెల్పర్ పోస్టులకు గడ్డంవారిపల్లెలో ఎస్టీ, నల్లపురెడ్డిపల్లెలో ఎస్టీ, 17వార్డులో ఈడబ్ల్యూఎస్, 6వ వార్డులో బీసీ సీ, చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో ఈడబ్ల్యూఎస్, సోమాపురం -1లో బీసీ ఏ, బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లెలో వర్కర్ బీసీసీ, మదిరెడ్డిపల్లెలో హెల్పర్ బీసీసీ, ఖాజీపేట మండలంలోని సి.కొత్తపేటలో హెల్పర్ ఎస్టీ వంతున ఖాళీలు ఉన్నాయి. అంగన్వాడీ వర్కర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత, 35 ఏళ్ల వయస్సు కలిగి స్థానికులైన వారు ఈ నెల 27వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలియజేశారు.

ఉత్తమ అర్చకుడిగా నరేంద్ర శర్మ


కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నరేంద్ర శర్మ

చాపాడు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాపాడు మండలం అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సామవేద పండితుడు నరేంద్ర శర్మ ఉత్తమ అర్చకుడిగా ఉగాది పురస్కారం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉగాది పురస్కార కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ విజయరామరాజు నుంచి నరేంద్ర శర్మ ఉత్తమ అర్చకుడిగా ప్రశంసా పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాల

పెండ్లిమర్రి : ఉగాదిని పురస్కరించుకుని నంది మండలం సమీపంలో వెలసిన కొండగంగమ్మ తిరునాల ఉత్సవాలు బుధవారం వైభవంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అభిషేకాలకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

బద్వేలు అర్బన్ : మన సనాతన ధర్మాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శోభకృత్‌నామ ఉగాది ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల మొదటి పండుగ, కష్ట, సుఖాలను సమానంగా తీసుకోవాలని తెలిపే పండుగ ఉగాది అని అన్నారు. ఆర్డీఓ ఆకులవెంకటరమణ మాట్లాడుతూ తెలుగులోగిళ్ళ సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏటా ఉగాది సంబరాలను బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సాహిత్యం విభాగంలో పుత్తాపుల్లారెడ్డి, సంగీత విభాగంలో పొత్తపి కొండయ్య, సామాజిక సేవ విభాగంలో పాపిజెన్ని రామకృష్ణారెడ్డిలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. గతేడాది పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వాస్తుజోతిష్య పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ళసత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం ఆకట్టుకుంది. సమగ్రశిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరంప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మశీనయ్య, జెడ్పీటీసీ పోలిరెడ్డి, బద్దెన కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసానిసాంబశివారెడ్డి, బలపనూరుశంభుప్రసాద్, ఉపాధ్యక్షులు సి.వి.నాగేశ్వర్‌రావు, సాంస్కృతిక కార్యదర్శి చింతంరెడ్డిరామచంద్రారెడ్డి, మ్యాజిక్ ప్రసాద్, శీలి వెంకటసుబ్బయ్య, కళాపీఠం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వేదపండితులు కనుమళ్ళసత్యనారాయణశర్మను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఆర్డీఓ

దేవాంగ కల్యాణ మండప కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కళ్యాణ మండపంలో బుధవారం 2023–2026 సంబంధించి నూతన కళ్యాణ మండప కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కమిటీ గౌరవాధ్యక్షులుగా వుట్టి వీరయ్య, సందు శివనారాయణ, జొన్న కుళ్లాయిస్వామి, వుట్టి నాగశయనం, వుట్టి తిరుపతయ్య, అధ్యక్షుడిగా పుచ్చగింజల రంగారావు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా వుట్టి సోమశేఖరరావు, కోశాధికారిగా గోదెన రామకృష్ణతో పాటు పలువురిని సభ్యులుగా, 10 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అందరు కలిసి మొత్తం 30 మంది గల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీకి ఎలక్షన్ ఆఫీసర్ ఓబుల రెడ్డి డిక్లరేషన్ పత్రాలు అందచేశారు. ఏప్రిల్ 2వ తేదీన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆయన తెలిపారు.


డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న పుచ్చగింజల రంగారావు

లైన్‌మెన్‌కు మరోసారి ఆర్థిక సాయం

కలసపాడు : మండలంలోని రాజుపాలెం సచివాలయ విద్యుత్ లైన్‌మెన్ సురేష్ ఇటీవల రాజుపాలెం వద్ద విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలై రాయవేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన లైన్‌మెన్ సురేష్‌కు బ్రాహ్మణపల్లెకు చెందిన ప్రజలు మరోసారి రూ.లక్ష, మండలానికి చెందిన వీఆర్‌ఏలు రూ.25 వేలు సేకరించి బుధవారం రాజుపాలెం సర్పంచ్ సూదా రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ బ్రహ్మానందరెడ్డికి రూ.లక్ష నగదును అందజేశారు. అలాగే రూ.25 వేలు నగదును లైన్‌మెన్ సురేష్ కుటుంబ సభ్యులకు వీఆర్‌ఏలు అందజేశారు. లైన్‌మెన్ సురేష్ వైద్య ఖర్చులకు రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.మాధవరెడ్డి, కె.వెంకటరామిరెడ్డి, ఎ.అమర్‌నాథ్‌రెడ్డి, సీనియర్ లైన్‌మెన్ బాబురావు, వీఆర్‌ఏలు గిరి, ప్రభాకర్, వెలుగు వీఏఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఈకి రూ.లక్ష నగదును అందజేస్తున్న బ్రాహ్మణపల్లె ప్రజలు

ఘనంగా గంగమ్మ జాతర

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతర కన్నుల పండువగా సాగుతోంది. బుధవారం ఉదయం 3 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను ప్రతిష్ఠించారు. గంగమ్మతల్లితో పాటు బోగాదమ్మ, చౌడమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. చౌడమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఎటువంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ రాజారమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు గంగమ్మతల్లి ప్రతిమను గ్రామ పొలిమేర వద్ద విడిచిపెట్టడంతో జాతర ముగుస్తుందని జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా లక్ష్మినరసింహ స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వాముల వారు

పెండ్లిమర్రి : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని వెయ్యినూతల కోనక్షేత్రంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవి అమ్మవార్ల కల్యాణం బుధవారం ఆలయ కార్యనిర్వాహకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



వీరపునాయునిపల్లె : ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని ఎన్. పాలగిరి గ్రామంలో లక్ష్మీదేవి సమేత చెన్నకేశవస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. గ్రామోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 240 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి పర్సనల్ లోన్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, రవణమ్మ, గురమ్మ, రమాదేవి, ప్రమీలమ్మ, రవికుమార్, అన్నపూర్ణ, ఓబయ్య, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

నిరుపేదలకు బియ్యం పంపిణీ

బద్వేలు అర్బన్ : మాస్క్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం, ఉగాది పండుగలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ఫాతిమా మసీదు ఆవరణలో కులమతాలకు అతీతంగా 150 నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాస్క్ కమిటీ అధ్యక్షులు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, మాస్క్ కమిటీ సెక్రటరీ సరిటాల మౌలాలిలు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రెండు సంవత్సరాలుగా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని, అల్లా దయతో ఇకపై కూడా ప్రతి నెల పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ 13వ వార్డు ఇన్‌చార్జి షఫీ, మాస్క్ కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, హుస్సేన్, సలీం, మత పెద్దలు పాల్గొన్నారు.


బియ్యం పంపిణీ చేస్తున్న మాస్క్ కమిటీ నాయకులు

సిద్ధమవుతున్న హలీం దుకాణాలు

ప్రొద్దుటూరు క్రైం : పవిత్ర రంజాన్ మాసం వస్తోందంటే అందరికీ గుర్తొచ్చేది హలీం. ఈ మాసంలో రోజా ఉన్న వారంతా ఉపవాస దీక్ష ముగించాక, బలవర్ధక ఆహారం తీసుకుంటారు. ఇలా తీసుకునే ఆహారంలో హలీం ఒకటి. అనేక పోషకాలతో నిండిన హలీంను రోజా ఉన్న వారే గాక, ఇతరులు కూడా ఇష్టంగా తింటారు. ఇందు కోసం ప్రొద్దుటరులో హలీం దుకాణాలను సిద్ధం చేస్తున్నారు. గాంధీ రోడ్డు, సుందరాచార్యుల వీధి, మైదుకూరు రోడ్డులో హలీం దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం నుంచి వ్యాపారాలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.


గాంధీ రోడ్డులో సిద్ధమైన హలీం తయారీకి వినియోగించే పొయ్యి

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తైక్వాండో శిక్షకుడు జంషీర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తైక్వాండోలో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించారు. ఎస్. సద్రిఆలం, అభిషేక్, ఉమర్‌అబ్దుల్లా, హలీమ సాదియ, అలకనంద, హృదయకుమార్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్‌లు సాధించడంపై కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు క్రీడాకారులను అభినందించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ కె. సురేష్‌బాబు